క్లుప్తంగా

అమర జవాన్లకు నివాళులు

సాక్షి, భీమవరం: దేశరక్షణ కోసం నిరంతరం పోరాడే సైనికులను 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో ఉగ్రవాదులు దాడిచేసి హతమార్చడం దారుణమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం మోషేన్‌రాజు తదితరులు మృతవీరుల సంస్మరణ సందర్భంగా ఆయన ఘనంగా నివాళులర్పించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీరజవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పెన్నాడ రమేష్ మాట్లాడుతూ జవాన్లపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు జి.సాయిసుగ్రీవ, యు.కమల్, విష్ణుసింహ, కె.దిన్నుచందు, జి.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంజీవయ్య జయంతి



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 102వ జయంతిని మంగళవారం భీమవరం పట్టణం 11వ వార్డులోని రాజ్‌ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌ట్రస్ట్ చైర్మన్ గంటా రాజ్‌కుమార్, ఎం సైమాన్, కొర్రపాటి అనిత, కాటూరి శాంతకుమారి, పట్టిం శుభాకర్, దాసరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరి నిర్మూలనపై అవగాహన



వెట్టి చాకిరి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం మండల న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో 'వెట్టి చాకిరి నిర్మూలన' అనే అంశంపై స్థానిక బుధవారం మార్కెట్ సమీపంలోని గ్రామ సచివాలయం వద్ద మున్సిపల్ కార్మికులకు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ ఎస్.రమేష్, సీహెచ్ రంగారావు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 9 నుంచి 15వ తేది వరకు 'వెట్టి చాకిరి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెట్టి చాకిరి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

సాక్షి, భీమవరం: కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు పిలుపునిచ్చారు. భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ హాల్లో మంగళవారం సీఐటీయూ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఆకుల హరే రామ్, బల్ల చిన్న వీరభద్రం, మామిడి శెట్టి రామాంజనేయులు, కె.రాజారామ్మోహన్‌రాయ్, జేఎన్వీ గోపాలన్, జుత్తిగ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

పాలకోడేరు: మినీ వ్యాన్ రివర్స్ చేస్తుండగా అక్కడే పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికుడిని ఢీ కొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ఉండి మండలం మహదేవపట్నంకు చెందిన కడలి సత్యనారాయణ (57) సోమవారం పాలకోడేరులోని కొత్తపేటలో ఇంటి నిర్మాణానికి సెంట్రింగ్ పనికి వెళ్లాడు. అక్కడ వ్యాన్ రివర్స్ చేస్తుండగా ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని భీమవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం ఉదయం ఆస్పత్రిలో సత్యనారాయణ మృతి చెందాడని అతడి కుమారుడు కడలి పోలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

ఈ-పోస్‌తోనే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలి

ఆకివీడు: ఎరువులు, పురుగు మందులను ఈ–పోస్ ద్వారానే విక్రయించాలని, నిబంధనల్ని అతిక్రమిస్తే ఎరువుల దుకాణాలపై చర్యలు తప్పవని తణుకు ఏడీఏ ఎమ్వీ.రమేష్ హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని దుకాణాల్లో రికార్డుల్లో వివరాలు సక్రమంగా నమోదు చేయలేదని, ఈ–పోస్ నమోదు కాలేదని ఆయన గుర్తించారు. ప్రతి రోజూ అమ్మకాల్ని ఆ రోజే నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని దుకాణ యజమానులకు సూచించారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లులు నమోదు సక్రమంగా ఉండాలని సూచించారు. ఆయా దుకాణాల్లో స్టాకు రిజిస్టర్లు, ఇన్‌వాయిస్, ఎరువుల బరువులు పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఎరువులు దుకాణాల తనిఖీలో మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక పాల్గొన్నారు.



స్థానిక ఎరువుల దుకాణంలో రికార్డుల్ని పరిశీలిస్తున్న తణుకు ఏడీఏ ఎంవీ రమేష్, ఏఓ ప్రియాంక



ఏలూరుపాడులో ఎరువుల గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పురుగు మందుల షాపుల్లో తనిఖీ

కాళ్ల: కాళ్ల మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పురుగు మందులు, ఎరువులు గోడౌన్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలో ప్రత్యేక బృందంతో తణుకు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.వి.రమేష్ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందుల షాపులను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో భాగంగా మండలంలో కాళ్ల, కాళ్లకూరు, ఏలూరుపాడు, జువ్వలపాలెం, బొండాడలోని ఎరువులు, పురుగు మందుల షాపులను తనిఖీ చేసి బిల్ బుక్స్, రిజిస్టర్లు, ఈ పాస్ పరికరాలను, స్టాకులను నిశితంగా పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జయవాసుకి పాల్గొన్నారు.

25 నుంచి 'అపూర్వ' వర్క్‌షాప్



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో 'అపూర్వ 23'వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. మంగళవారం వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా వివిధ రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్న కళాశాల పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా పాల్గొని నూతన సాంకేతికతను విద్యార్థులు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ, డాక్టర్ బి.ఆర్.కె వర్మ, డాక్టర్ పి.కాంతారావు, కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్ వర్మ, విద్యార్థి కోఆర్డినేటర్స్ జి.సాయి కిరణ్, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం

భీమవరం అర్బన్: ప్రతి రోజు గంట పాటు సైకిల్ తొక్కడం ద్వారా రోగాలు రాకుండా ఆరోగ్యాన్ని పదిల పరుచుకోవచ్చని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో, వైద్యాధికారి సుగుణరాజు అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రులో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వద్ద సైకిల్ తొక్కే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుగుణరాజు మాట్లాడుతూ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో ప్రతి నెల 14న సైక్లింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత సమాజంలో వ్యాయామాలు చేయకుండా తీవ్ర ఒత్తిడికి గురై అనేక అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారన్నారు. గంటపాటు సైకిల్ తొక్కడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధారుఢ్యం పెరిగి వ్యాధులు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిని అరుణకుమారి, ఎంపీహెచ్ఎస్‌సీహెచ్ పెద్దేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ రవి, జ్యోతి, ఆశా కార్యకర్తలు రత్నకుమారి, ఝాన్సీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



తుందుర్రులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రోజూ వ్యాయామం చేయాలి

పాలకోడేరు: ప్రతిరోజు సైకిల్‌తో వ్యాయామం చేయడం ద్వారా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంగమనాయుడు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పీ ఆధ్వర్యంలో సైకిల్‌తో వ్యాయామం కార్యక్రమాన్ని మంగళవారం గొరగనమూడి, విస్సాకోడేరు, పాలకోడేరు, కుముదువల్లిలో నిర్వహించారు. డాక్టర్ రంగమనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ విశ్రాంతి లేకుండా ఒత్తిడి జీవితాన్ని సాగిస్తున్నారన్నారు. ఆ తరుణంలో సైక్లింగ్ చేయడం ద్వారా బీపీ సుగర్‌ను తగ్గించుకోవడమే కాకుండా ఒత్తిడిని సైతం జయించవచ్చన్నారు. ప్రతిరోజు ఒక గంట సైక్లింగ్ చేయాలని విద్యార్థులకు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు ఎం విజయ ప్రసాద్, గోపాలకృష్ణ, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు రాజశేఖర్, రమాలీల, లలిత మహాలక్ష్మి, ఏఎన్ఎం వేదకుమారి, సుజాత తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంపై శ్రద్ధ వహించాలి

కాళ్ల: లేగదూడల పెంపకంపై పాడి రైతులు శ్రద్ధ వహించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. కాళ్ల మండలం దొడ్డనపూడిలో పశుసంవర్ధక, పశుగణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన, అందాల పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 30 పాడి రైతులు లేగదూడలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యాధికారుల సమక్షంలో అందాల పోటీల్లో విజేతలుగా నిలిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన లేగదూడల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న అందరి రైతులకు ఉచిత మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారులు డాక్టర్ జవార్ హుస్సేన్, డాక్టర్ జేసురత్నం, డాక్టర్ కె.జనార్ధనరావు, ఆకివీడు ఎ.డి డాక్టర్ సత్యనారాయణ, మండల వైద్యాధికారి డాక్టర్ చంద్రబాబు, ఉపసర్పంచ్ నక్కా వీరకృష్ణ, కొల్లి నరసింహమూర్తి, వెటర్నరీ సిబ్బంది, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

గొర్రెలకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భీమవరం అర్బన్: గొర్రెలు, మేకలకు సోకే వ్యాధుల పట్ల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఏడీఏ పి. సుధీర్ బాబు అన్నారు. మండలంలోని అనాకోడేరు గ్రామంలో మంగళవారం గొర్రెలు, మేకలకు బీడ పారుడు వ్యాధి (పీపీఆర్) సోకకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సుధీర్ బాబు మాట్లాడుతూ గ్రామాలలో చాలామంది రైతులు వ్యవసాయంతో పాటుగా గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల అనుబంధంగా పెంచుతూ అదనపు ఆదాయాన్ని పొందుతారని గొర్రెలు, మేకలు సోకే వ్యాధులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యాక్సినేషన్ చేయించుకోవాలన్నారు. మండల పశువైద్యాధికారి పి. పుండరీబాబు మాట్లాడుతూ 750 గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్ చేసినట్లు చెప్పారు. పెంపకందారులు ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షులు పట్టపగలు వెంకటేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అనాకోడేరులో గొర్రెలకు పీపీఆర్ సోకకుండా వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

హీరో గ్జూమ్ స్కూటర్ ఆవిష్కరణ

సాక్షి, భీమవరం: ద్విచక్ర వాహనం నడిపే ప్రతీ ఒక్కరూ విధిగా హెల్మెట్లను ధరించాలని ఆర్టీఏలు సుబ్బలక్ష్మి, రవికుమార్ సూచించారు. భీమవరంలోని రెడ్డి అండ్ రెడ్డి ఆటోమొబైల్స్‌లో మంగళవారం హీరో గ్జూమ్ 110 సీసీ స్కూటర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఇష్టాలకు అనుగుణంగా అత్యాధునిక టెక్నాలజీతో హీరో కంపెనీ ఈ స్కూటర్‌ను తయారు చేసిందని తెలిపారు. రెడ్డి అండ్ రెడ్డి ఆటోమొబైల్స్ ఎండీ గొలుగూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ బ్లూటూత్, హీరో కనెక్ట్, సైడ్ స్టాండ్ ఇంజన్ కంట్రోల్ ఆఫ్, మొబైల్ చార్జింగ్ పోర్ట్ తదితర సౌకర్యాలు ఈ స్కూటర్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం మెకానిక్ యూనియన్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, టీఎస్ఎం బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



హీరో గ్జూమ్ 110 సీసీ స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పరిశ్రమల్లో ప్రమాదాలపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): రసాయనిక పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలి అనే విషయమై మంగళవారం భీమవరం ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని జిల్లా పరిశ్రమల అధికారి ఉయ్యాల ఆదిశేషు తెలిపారు. భీమవరం ఇండస్ట్రియల్ పార్క్ లోనీ సంతోషిమాత ఫీడ్ ఫ్యాక్టరీ, స్వామి ఫీడ్స్, సీసలిలోనీ జయలక్ష్మి సీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కుమార్ ఆగ్రో ఆయిల్స్ పరిశ్రమలను ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సందర్శించి రసాయనిక పరిశ్రమలలో ప్రమాదాలను ఎలా నివారించాలి? తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం సంభవించిన అనంతరం చేపట్టవలసిన చర్యలపై పూర్తి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఇన్‌స్పెక్టర్ వై.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం కృష్ణ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమల్లో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ముగిసిన గాంధీ వర్ధంతి వారోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గత 15 రోజులుగా శ్రీవిజ్ఞాన వేదిక, సెయింట్ మేరీస్ సెంటర్ ,జిల్లా వైద్యశాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ కుష్టి వ్యాధి నివారణ పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమాలు , భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించి, వివిధ పాఠశాలల, కళాశాల, విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసపత్రాలు బహుమతులు అందించే కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు మందులు కనిపెట్టారని , 90% సమస్య పోయిందని ఇటీవల కాలంలో అక్కడక్కడ వచ్చిన కేసులను తగ్గించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వైద్య శాఖలు ప్రయత్నం చేస్తున్నాయని , దీనికి భీమవరం పట్టణంలో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, లెప్రోసి సెంటర్లు చేస్తున్న సేవలు అద్వితీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పక్షోత్సవాలలో డిఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల, డాక్టర్ సీఎస్ ఎన్ జూనియర్ కళాశాల , సంస్కార్ స్కూల్, శ్రీవిద్య కాన్వెంట్, పీఎస్ఎన్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థుల విద్యార్థులకు 216 మందికి వివిధ పోటీలు నిర్వహించగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ , ఉండపల్లి రమేష్ నాయుడు ఆర్థిక సహకారంతో విలువైన బహుమతులు,జిల్లా వైద్య శాఖ అధికారి సమక్షంలో సర్టిఫికెట్లు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా లెప్రసి సెంటర్ సేవలందిస్తున్నటువంటి సిస్టర్ సెలిన్, సిస్టర్ ఎల్విరా, ఏవో ఆకుల పెద్దిరాజు , బాబ్జి కుమారిలను సత్కరించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమామహేశ్వర రావుని, భీమవరం లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నందమూరి రాజేష్ , నరహరిశెట్టి కృష్ణ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు కనుమూరి సత్యనారాయణ రాజు, డీఎంహెచ్‌ఓ కార్యాలయం పారామెడికల్ ఆఫీసర్ రామకృష్ణ, సీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

భీమవరం అర్బన్: సాగులో ఈ క్రాప్ నమోదుతో ప్రభుత్వం ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు ఈ క్రాప్ నమోదుపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు వల్ల ధాన్య విక్రయించడం, పంట బీమా, సాగులో ప్రభుత్వ పథకాలు ద్వారా వచ్చే రాయితీలు వర్తిస్తాయన్నారు. పలు అంశాలపై వ్యవసాయాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు వెంట ఏడీఏ వి. నారాయణరావు, మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్, వీఆర్‌వో శ్రీనివాస్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణి, రైతులు తదితరులు ఉన్నారు.



యనమదుర్రులో క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

బాల్య వివాహాలపై అవగాహన

నరసాపురం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఉపాధ్యాయురాలు శాంతి సుధ అన్నారు. నరసాపురం మండలంలోని మంగళగుంటపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జరిగిన కిశోర బాలికలు, బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, విద్యార్థులు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు. మంగళవారం స్థానిక పెన్మత్స రంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బాల్య వివాహాలు, వాటి అనర్థాలు అనే విషయంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ మూర్తిరాజు, మహిళా పోలీసులు కల్యాణి, సుధారాణి, మేరీపుష్పరాజ్యం, రంగనాయకమ్మ పాల్గొన్నారు.



మంగళగుంటపాలెంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చంద్రబాబువి కుటిల యత్నాలు

పెనుగొండ: పేదప్రజలను మరోసారి మోసం చేయడానికి చంద్రబాబు, వారి దుష్ట చతుష్టయం కుటిల యత్నాలు చేస్తున్నారని, ప్రజలు మోసపోవద్దని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం పెనుగొండలో శాంతి నగర్, దొంగగూడెం, మారెమ్మ గూడెం, ఇందిర శాంతి నగర్‌లలో గడపగడపకూ మన ప్రభుత్వంలో పాల్గొని లబ్ధిదారులకు అందిన సంక్షేమాన్ని వివరించారు. ఎప్పుడూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 10 శాతం కూడా అమలు చేయని చంద్రబాబు, నేడు నవరత్నాలకన్నా అధికంగా సంక్షేమాన్ని అమలు చేస్తానని మభ్యపెడుతున్నారన్నారు. నిన్న మొన్నటి వరకూ నవరత్నాలుపై విమర్శలు చేసిన చంద్రబాబు, ఇప్పుడు యూ టర్న్ తీసుకొని సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమాన్ని అమలు చేస్తానంటున్నారన్నారు. దీనికి దత్తపుత్రుడు సైతం తోడై ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. చరిత్రలో ఎన్నడూ, ఎక్కడా లేని విధంగా పేద ప్రజల సంక్షేమం కోసం రూ. రెండు లక్షల కోట్లుకు పైగాఖర్చు చేశారన్నారు. అర్హులందరికీ లబ్ధి చేకూరే విధంగా సీఎం జగన్ పథకాలను అమలు చేసారన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, ఏఎంసీ వైస్ చైర్మన్ తానేటి మల్లి, ఎంపీటీసీలు తాడి సుబ్బిరెడ్డి, చిన్నం ఏడుకొండలు, రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

నేడు కుముదవల్లికి విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకోడేరు: 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం 15వ తేదీ బుధవారం కుముదవల్లి గ్రామానికి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు

ఆకివీడు: ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు పెంచాలని సీహెచ్‌సీ సలహా, అభివృద్ధి మండలి చైర్మన్, ఎమ్మెల్యే మంతెన రామరాజు సూచించారు. స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులను, డాక్టర్లను పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. వైద్య సదుపాయాలు పెరగడంతో వైద్యు సిబ్బంది రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పరిగేందుకు కృషి చేయాలన్నారు. రికార్డుల్ని, నిధుల వినియోగాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి సువార్త మహాసభలు

ఉండి: ఉండి పెనూయేలు ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉండి బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్టీఆర్ ఎస్టేట్‌లో నిర్వహిస్తున్న 18వ వార్షిక సువార్త మహా సభలను ఈ నెల 15వ తేదీ అనగా బుధవారం నుంచి 17వ శుక్రవారం వరకు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఈదా విజయ్‌ప్రసాద్, దాయం సునీత తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభించే సభలకు ముఖ్య ప్రసంగీకులుగా అంతర్జాతీయ ప్రసంగీకులు బ్రదర్ అనిల్‌కుమార్, పాస్టర్ ఎం జ్యోతిరాజు హాజరవుతారని తెలిపారు. ఈ సభలకు క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలిరావాలని పాస్టర్ విజయ్‌ప్రసాద్ కోరారు.

డీఎన్నార్ కళాశాల వద్ద అధ్యాపకుల నిరసన

సాక్షి, భీమవరం: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విద్యావ్యవస్థలో అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకరంగా భీమవరం డీఎన్నార్ కళాశాలలో మంగళవారం ఏసీటీఏ పిలుపుమేరకు అధ్యాపకులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విదేశీ విశ్వవిద్యాలయాలను దేశంలోనికి అనుమతించరాదని, 2020 కొత్త విద్యావిధానం రద్దు చేయాలని, ఎడ్యుకేషన్ బడ్జెట్ తగ్గించవద్దంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

పాలకోడేరు: వేండ్ర గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు యువకులను మంగళవారం అరెస్ట్ చేసినట్టు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి రూ.4,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

పాలకోడేరు: నలుగురు యువకులు అర్ధరాత్రి తమ ప్రాంతానికి వచ్చి చేస్తున్న అల్లరిని అడ్డుకున్నందుకు తనపై దాడి చేసి గాయపరిచారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. కోరుకోల్లు గ్రామానికి చెందిన మంద రాజేష్ ఇంటి పరిసరాల్లో అదే గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు విజయ్, కోడెల్లి సురేంద్ర, కోడెల్లి జాన్, దిరిసిపో రాజేష్ సోమవారం రాత్రి అల్లరి చేస్తుండగా అడ్డుకున్నాడు. దాంతో ఆ నలుగురు కలిసి అక్కడే ఉన్న ఇటుకలతో రాజేష్‌పై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.